క్లుప్తంగా

నంగమంగళంలో వైద్యశిబిరం



గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనూష తెలిపారు. నంగమంగళంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ప్రియాంక, శ్రీలత, రూబీ, వరలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన అవసరం



నేత్రదాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజేశ్వరి

ఐరాల: నేత్రదానంపై అవగాహన కలిగి అంధత్వ నివారణకు కృషి చేయాలని కాణిపాకం పీహెచ్‌సీ డాక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అగరంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మరణాంతరం ఒకరు నేత్రదానం చేస్తే నలుగురికి చూపు ఇవ్వవచ్చన్నారు. నేత్రదానం చేయదలచిన వారు తిరుపతి రుయా ఆస్పత్రి ఐ బ్యాంకును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంవో హరిప్రసాద్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ మనోహర్, ల్యాబ్ టెక్నీషియన్ హరిత, ఏఎన్‌ఎం నిర్మల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.60 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.1.60 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. 16 మందిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.1.60 లక్షల జరి మానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె: మండలం ఏ.గొల్లపల్లెలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఐరాల సీడీపీవో నిర్మల, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, సర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫలించిన ఎస్టీయూ కృషి



సీఈవో గ్లోరియాతో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలోని పీఎఫ్ సమస్యలపై ఎస్టీయూ చేసిన కృషి ఫలించిందని ఆ యూనియన్ నాయకులు తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతనెలలో ధర్నా చేస్తామని చెప్పగా సీఈవో, చైర్మన్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం 2021 మార్చి వరకు ఉపాధ్యాయుల పీఎఫ్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుతున్నట్టు తెలిపారు. త్వరలో మొత్తం వివరాలు అందుబాటులోకి వస్తాయని సీఈవో వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పురుషోత్తం, నాయకులు దేవరాజులురెడ్డి, చంద్రన్, గుణశేఖర్, సుబ్రహ్మణ్యం, హరీష్, రంగనాథం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతులతో చవితికి సిద్ధం

చిత్తూరు నగరం చవితికి సిద్ధమైంది. వీధివీధిలోనూ పందిరి వెలిసింది. చిచ్చర పిడుగులు మట్టిని తెచ్చి బొమ్మలు చేశారు. జయజయ వినాయకుడిని పందిరిలో కొలువుదీర్చి చవితి సంబరానికి సిద్ధమయ్యారు. శనివారం జరిగే ఈ చవితి వేడుకలకు చిత్తూరు నగరంలో పలు వీధులు ముస్తాబయ్యాయి.

–చిత్తూరు రూరల్ (కాణిపాకం)

- చిత్తూరులో వినాయక చవితి సందడి
- వాడవాడలా వెలసిన మండపాలు
- జోరందుకున్న అమ్మకాలు
- డీఐ రోడ్డులో ప్రత్యేకంగా చవితి ఏర్పాట్లు





పూజ అందుకోవడానికి సిద్ధంగా ఉన్న వేపమాను వీధిలోని మట్టితో తయారు చేసిన వినాయకుడు, గిరింపేటలో మండపం పనుల్లో చిన్నారులు

చిత్తూరులో శనివారం వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. ఉదయం గణపయ్యను కొలువుదీర్చి విశేష పూజలు చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మకాలు, కొనుగోలు జోరందుకున్నాయి. ప్రధానకూడళ్లు జనంతో కిటకిటలాడాయి. విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉండాలని అలంకరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మండపాల వద్ద లైట్ సెట్టింగ్‌తోపాటు వివిధ రకాల పూలు, బెలూన్ డెకరేషన్, అరటి, మామిడి తోరణాలతో పందిళ్లను ముస్తాబు చేస్తున్నారు.

అంబారన్నంటిన సంబరాలు

డీఐ రోడ్డుతో పాటు గిరింపేట, దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, మిట్టూరు, మురకంబట్టు, సంతపేట తదితర ప్రాంతాల్లో ఏటా వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి చవితి సంబరాలు ప్రతి వీధుల్లోను ఏర్పాట్లు చేశారు. చిన్న పిల్లలు, పెద్దలు, యువకుల్లో చవితి ఉత్సాహం కనిపిస్తోంది. మండపాల వద్ద లైట్ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

డీఐరోడ్డులో.

చిత్తూరు నగరంలోని డీఐరోడ్డులో ఈసారి ఏడు గణపతులను ప్రతిష్ఠించనున్నారు. ఈ ఏడు విగ్రహాలు భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఒక్కో వాహన సేవల్లో స్వామి వారు భక్తులను కనువిందు చేసేలా కొలువుదీర్చనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు తొలిపూజ ప్రారంభం కానుంది. ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అలాగే ప్రత్యేక వాయిద్యాలను కూడా రప్పించారు. రాత్రికి విశేష పూజలు జరగనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

జోరందుకున్న కొనుగోలు

వినాయక చవితి పండగలో భాగంగా చిత్తూరు నగరంలోని బజారువీధి, చర్చివీధి, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో వినాయకుని ప్రతిమలతో పాటు పూజకు అవసరమైన పూలు, పండ్లు, ఇతర అవసర సామగ్రిని అమ్మకానికి తెచ్చి పెట్టారు. అరటి పిలకలు, మామిడి ఆకులు, చెరుకు గడలు, జిల్లేడు పూలు, పూలు, రకరకాల కాయల విక్రయాలు జోరందుకున్నాయి. చిన్న బొమ్మలు ఎక్కువగా అమ్ముడుబోయాయి. భారీ విగ్రహాలకు డిమాండ్ ఏర్పడింది.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలో గణపయ్య వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు యువకులు సర్వం సిద్ధం చేసుకున్నారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లోని 180 గ్రామాల్లో 500 వరకు చిన్న, పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలను సైతం సాయంత్రం లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలన్నారు.



బంగారుపాళెం: విక్రయానికి గణపయ్య విగ్రహాలు



డీఐరోడ్డులో ఏర్పాటు చేసిన మండపం



వేపమాను వీధిలో మండపం



డీఐరోడ్డులో భారీ విద్యుత్ కటౌట్





పూజ సామగ్రి కొనుగోలులో మహిళలు



వినాయకుడి బొమ్మలు కొంటున్న మహిళలు

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు నగరంలోని మురకంబట్టు వరసిద్ధి వినాయక ఆలయ నూతన కల్యాణ మండపం వద్ద 14 రోజులు ఉచితయోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సిద్ధ సమాధి యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలు, ఆహారపు అలవాట్లు, పంచకోశ శుద్ధి నేర్పిస్తామని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు పైబడిన వారు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8247609140లో సంప్రదించాలని కోరారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నరసింహులు

ఐరాల: వినాయక చవితి సందర్భంగా పందిరి, మండపాల ఏర్పాటుచేసుకునేవారి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఆయన శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు ఉపయోగించాలన్నారు. చర్చిలు, మసీదుల వద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. నిమజ్జనం రోజు ట్రాక్టర్‌ను నడిపే డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని చెప్పారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మొరంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ రాత్రిళ్లు దోమకాటుకు గురికాకుండా వేపాకు పొగ వేసుకోవాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న మేయర్ అముద



వివిధ వేషధారణలో విచ్చేసిన విజయం విద్యార్థులు

చిత్తూరు అర్బన్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మట్టితో చేసిన విగ్రహాలను పూజిద్దామని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 2000 మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జీజేఎం ట్రస్టు నిర్వాహకులు గురజాల చెన్నకేశవుల నాయుడు, కార్పొరేషన్ సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, సీఎం గోపి, ఏఈలు లోకేష్, రజని, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు వేడుకలు..

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు విద్యాసంస్థల్లో ముందస్తుగా శుక్రవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. మట్టి వినాయకులను తయారు చేశారు.

విజయం పాఠశాలలో: నగరంలోని సుందరరాజపురంలో ఉన్న విజయం సీబీఎస్‌ఈ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు అట్టహాసంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల చైర్మన్ తేజోమూర్తి, డైరెక్టర్ శైలజ తెలిపారు. విద్యార్థులకు వినాయక చవితి పండుగ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ కౌసల్య, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హార్వర్డ్ పాఠశాలలో: నగరంలోని రామ్‌నగర్ కాలనీలో ఉన్న హార్వర్డ్ పాఠశాలలో వినాయకచవితి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. కరస్పాండెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ వేదకాలం నుంచి నేటి వరకు ఆస్తికులందరూ ఏ ముఖ్యమైన పని తలపెట్టినా, దాన్ని గణపతి పూజతోనే ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం

మట్టి వినాయకులనే పూజిద్దామని వన్ టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు. నగరంలోని మిట్టూరులో ఉన్న అరుణాచల కళాశాల ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్ వద్ద ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను చెరువులు, కుంటల్లో వేయడం వల్ల అవి కరగక నీరు కలుషితం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని కోరారు.





హార్వర్డ్ పాఠశాలలో వేడుకలు, మట్టివినాయకులను పంచుతున్న సీఐ జయరామయ్య

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి

గుడుపల్లె: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మిని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కనమనపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వాతావరణ ఆధారిత పంటల సాగుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రైతులు పంటలు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, భూసార పరీక్షలు వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం పంటలు సాగు చేయాలన్నారు. అడవి పందులు యాజమాన్యం, వివిధ పంటలలో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామంలో వేసిన రాగి పంటను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏవో నాగరాజు, రైతు సేవా కేంద్రం నవీద్ పాల్గొన్నారు.



రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు

చిత్తూరు అర్బన్: వినాయక విగ్రహాల నిమజ్జనానికి మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కట్టమంచి చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసినట్లు సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి అనీల్ కుమార్ నాయక్ తెలిపారు. వారు శుక్రవారం కట్టమంచి చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, ఉద్యోగులు, సిబ్బంది కేటాయింపు, విధుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు వీలుగా కట్టమంచి చెరువు కట్టపైన ప్రత్యేక వేదిక నిర్మించారు. బారికేడ్ల ఏర్పాటు, లైటింగ్, నీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వీలుగా రెండు పెద్ద క్రేన్లను అందుబాటులో ఉంచనున్నారు. వినాయక చవితి రోజు నుంచి ఏడు రోజులు నిమజ్జనం సజావుగా సాగేందుకు వీలుగా ఉద్యోగులు, సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో ఏఈ రజని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, సీఎం గోపి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవం.. తల్లీ బిడ్డకు శ్రేయస్కరం

తవణంపల్లె: ఆస్పత్రిలో ప్రసవించడం వల్ల తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండంలోని ఎగువతవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అనంతరం 47 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎగువతవణంపల్లెలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకాష్ మృతి

గుడిపాల: మండలంలోని వెంగమాంబపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకాష్(40) శుక్రవారం మృతిచెందారు. ఆయన బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. గుడిపాలలో జరిగే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉంటారు. శనివారం వెంగమాంబపురం పంచాయతీలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆకాష్ (ఫైల్)

వరద బాధితులకు కానిస్టేబుల్ రూ.25 వేల విరాళం

చిత్తూరు అర్బన్: విజయవాడ వరద బాధితులకు శనివారం కానిస్టేబుల్ రూ.25 వేల విరాళాన్ని అందజేసి ఉన్నత మనసును చాటుకున్నాడు. చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ విజయవాడలో సంభవించిన వరదలను చూసి చలించిపోయారు. బాధితులకు కనీస అవసరాలు లేకపోవడాన్ని గుర్తించి.. తన వేతనం నుంచి రూ.25 వేలను వరద బాధితుల కోసం శుక్రవారం ఎస్పీ మణికంఠకు అందజేశారు.



ఎస్పీకి చెక్కు అందజేస్తున్న కానిస్టేబుల్ మురళీకృష్ణ

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఆయన శుక్రవారం ఆ సంఘం నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యకలాపాలకు స్థలం కేటాయించాలని కోరారు. వివిధ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కచ్చితంగా అంబేద్కర్ ఫొటోను పెట్టేలా ఉత్తర్వులు జారీచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సులోచన, జిల్లా అధ్యక్షుడు మురళి, కార్యదర్శి మహేందర్, కుమారి తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న వినాయకం